
# ప్రభాత సూర్యుడు
తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :136 EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 27 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 136 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 27 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## చంద్రబాబు పిటీషన్లు వాయిదా

విజయవాడ - ప్రభాత సూర్యుడు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిటిషన్‌లపై విచారణ బుధవారినికి వాయిదా పడింది. చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్‌లపై విచారణ నేడు జరగాల్సి ఉంది. ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సెలవుపై ఉండటంతో విచారణ రేపటికి వాయిదా పడింది. సీఐడీ కస్టడి పొడిగింపు

మిగతా 2లో...

## ఆసియా కప్‌లో మరో స్వర్ణం



ముంబై- ప్రభాత సూర్యుడు

చైనాలోని హాంగ్ ఝౌ నగరంలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో నేడు భారత్ కు మరో స్వర్ణం లభించింది. ఈక్వెస్ట్రియన్ (అశ్విక క్రీడ) ఈవెంట్లో డ్రెస్సేజ్ విభాగంలో భారత్ అద్భుత విజయం సాధించింది. 41 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్ ఆసియా కప్ లో ఈక్వెస్ట్రియన్ స్వర్ణం గెలవడం విశేషం. భారత ఈక్వెస్ట్రియన్ జట్టులోని సుదీప్తి హజేలా, దివ్యకృతి సింగ్, హృదయ్ ఛెడా, అనుష్ అగర్వాలా తమ ఈక్వెస్ట్రియన్ నైపుణ్యంతో భారత్ ఖాతాలో పసిడి పతకం చేర్చారు. 41 ఏళ్ల తర్వాత గుర్రపు పందేల్లో తొలి పతకం అందుకుంది. డ్రెసేజ్ విభాగంలో ఏకంగా స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఆతిథ్య చైనాను వెనక్కి నెట్టింది. హృదయ్ చెడ్డా, దివ్యకృతి సింగ్,

మిగతా 2లో...

# తెలంగాణలో కమలం గ్రాఫ్ పడిపోతోంది..!

- మారుతున్న రాజకీయ పరిణామాలు
- బీజేపీ నేతల్లో కొరవడిన సఖ్యత

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో రాజకీయ సమీకరణాలు మారి పోతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో జోష్ పెరిగిపోతుంటే... రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ మాత్రం అంతకంతకూ పడిపోతోంది. రాష్ట్ర బీజేపీ నేతల్లోనూ సఖ్యత కొరవడిందని సమాచారం. బీఆర్ఎస్‌లో టికెట్ దక్కని కీలక నేతలంతా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. మరికొందరు కూడా హస్తంతో చెయ్యి కలిపేందుకు సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ నుంచే కాదు.. బీజేపీలోని కీలక నేతలు కూడా తమతో టచ్‌లో ఉన్నారని తెలంగాణ కాంగ్రెస్ నేతలు పదే పదే ప్రకటిస్తున్నారు. అంటే... తెలంగాణ బీజేపీ నేతలు కూడా ఆ పార్టీని వీడి.. కాంగ్రెస్‌లో చేరబోతున్నారా..? అంటే... జరుగుతున్న పరిణామాలు చూస్తే.. అవుననే అనిపిస్తోంది. ఈటల రాజేందేందర్‌కు జాతీయ నాయకత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నప్పటి నుంచి బీజేపీలోని ఓ వర్గం రగిలిపోతోంది. ఈటల చెప్పడం వల్లే బండి సంజయ్‌ను కూడా రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించారన్నది వారి ఆరోపణ. ఈటలకు ప్రాధాన్యం ఇవ్వడమే కాదు... రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులుగా ఉన్న తమకు

మిగతా 2లో...

## లిక్కర్ స్కాంలో కవితకు ఊరట



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ విచారణ ఎదుర్కొంటున్న కవితకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. కవిత దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారణ సుప్రీంకోర్టులో జరిగింది. ఈ సందర్భంగా తదుపరి విచారణను నవంబర్ 20వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకూ ఈడీ సమన్లు కూడా జారీ చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈడీ విచారణ ఎదుర్కొనే అంశంలో కవితకు ఊరట లభించినట్లయింది. గత విచారణ సందర్భంగా ఈడీ ముందు మహిళల హాజరు అంశంపై కౌంటర్ అఫిడవిట్ దాఖలకు 10 రోజుల సమయం

మిగతా 2లో...

## పాలమూరులో కాలు పెట్టే నైతిక హక్కు మోడీకి లేదు

మంత్రి కేటీఆర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎన్డీయే ప్రభుత్వం ఎన్డీయేలోనే తెలంగాణ రాష్ట్రంపై విషం నింపుకునీ ఉన్నది అని మంత్రి కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ పర్యటనకు ప్రధాని మోడీ వస్తున్నారు కాబట్టి కొన్ని ప్రశ్నలు అడుగుతున్నాము.. తెలంగాణపై నరేంద్ర మోడీ ఎందుకు విషం చిమ్ముతున్నారు?.. తెలంగాణ పుట్టుకను పదే పదే ఎందుకు అవమానిస్తున్నారు?.. అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అమృత కాలం అన్నారు.. విషం చిమ్మారు.. మోడీ సర్కార్ విభజన హామీలను గాలికి వదిలేశారు.. ఇక, వచ్చే ఎన్నికల్లో బీజేపీ పార్టీ అడ్రస్ లేకుండా పోతుంది అని కేటీఆర్ విమర్శలు గుప్పించారు.తెలంగాణలో దశాబ్ది వేడుకలు జరుపుకున్నాం.. కానీ వేడుకలు జరుగలేదని ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ సాక్షిగా అబద్దాలు చెప్పాడు అని మంత్రి కేటీఆర్ మండిపడ్డాడు. మోడీ పాలమూరు జిల్లాను ఎంచుకున్నారు.. ఆ జిల్లాలో కాలు పెట్టే నైతిక హక్కు ఆయన లేదు అని మంత్రి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాకు ప్రధాని మోడీ ప్రభుత్వం ఏమి చేసింది?.. గోదావరి, కృష్ణ జలాల్లో వాట తేల్చాలని కోరారు.. ఇప్పటి వరకు అతి గతి లేదు.. ఇరిగేషన్ ప్రాజెక్ట్ లకు జాతీయ హోదా ఇవ్వాలని ఎన్నో సార్లు అడిగాం.. కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదు అంటూ మంత్రి కేటీఆర్ తెలిపారు.నీటి వాటాపై ప్రధాని నరేంద్ర మోడీ పాలమూరు గడ్డపై కాలు పెట్టేటప్పుడు స్పష్టత ఇవ్వాలి అని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. కర్ణాటక, ఏపీలో ఇరిగేషన్ ప్రాజెక్ట్ లకు జాతీయ హోదా ఇచ్చింది.. భారతీయ జనతా పార్టీ కాదు మీది.. దగుల్బాజీ పార్టీ మీది.. బీజేపీ పార్టీ జాతీయ పార్టీ అయిన.. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో నీతి ఆ పార్టీది.. కృష్ణా జలాలపై మా వాట ఎందుకు తేల్చారు మోడీ? చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. సుప్రీం

మిగతా 2లో...

## జగన్ది ఫ్యాక్షన్ కక్ష..!

- ఢిల్లీలో ఎంపీలు, ముఖ్యనాయకులతో లోకేష్



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఏపీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి ఫ్యాక్షన్ మనస్తత్వంతో టిడిపిపై కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని, ధర్మమే టిడిపికి రక్షణగా నిలుస్తుందని టిడిపి నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ అశోకా రోడ్డు 50లోని ఎంపీ గల్లా జయదేవ్ కార్యాలయంలో మంగళవారం టిడిపి ఎంపీలు, అందుబాటులో ఉన్న టిడిపి నేతలతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమావేశం అయ్యారు. చంద్రబాబు గారి అక్రమ అరెస్టు, వైకాపా సర్కారు పెడుతున్న తప్పుడు కేసులు, టిడిపి న్యాయపోరాటం అంశాలపై చర్చించారు. ఎటువంటి సంబంధంలేకున్నా అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో

మిగతా 2లో...

## 3 నెలల్లో 90 వేల వీసాలు




ముంబై- ప్రభాత సూర్యుడు

ఈ వేసవిలో రికార్డు స్థాయిలో స్టూడెంట్ వీసాలు జారీ చేశామని, మొత్తం 90 వేలు మించిపోయాయని భారత్ లోని యునైటెడ్ స్టేట్స్ ఎంబసీ వెల్లడించింది. జూన్, జులై, ఆగస్టు నెలల్? వీసాలు జారీ చేసినట్లు ట్విట్టర్ వేదికగా వెల్లడించింది. ఇంత భారీ మొత్తంలో విద్యార్థి వీసాలు జారీ చేయడం భారత దేశం, అమెరికా మధ్య విద్యా మార్పిడిలో చారిత్రాత్మక మైలురాయిని సూచిస్తుందని పేర్కొంది. ఈ వేసవిలో ప్రపంచవ్యాప్తంగా జారీ అయిన వీసాల్లో అత్యధికంగా భారత్ నుంచే ఉన్నాయని తెలిపింది.ప్రపంచవ్యాప్తంగా జారీ అయిన ప్రతి నాలుగు విద్యార్థి వీసాల్లో ఒకటి భారత దేశంలోనే జారీ చేసినట్లు యునైటెడ్ స్టేట్స్ ఎంబసీ తెలిపింది. తమ ఉన్నత విద్యా లక్ష్యాలను సాకారం చేసుకోవడానికి యునైటెడ్ స్టేట్స్ ను ఎంచుకున్న

మిగతా 2లో...

## పటాన్‌చెరు బిఆర్ఎస్‌లో టికెట్ లొల్లి

- గవర్నర్ తిరస్కారంతో కొత్త పంచాయతీ
- బిఆర్ఎస్ టికెట్టును సత్యనారాయణకే కేటాయించాలని డిమాండ్






తెలంగాణ బ్యూరో - ప్రభాత సూర్యుడు


**నామినేటెడ్ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కుర్ర సత్యనారాయణ, దాసోజు శ్రవణ్ పేర్లను బిఆర్ఎస్ ప్రభుత్వం గవర్నర్ కు సిఫార్సు చేయగా, ఆ అభ్యర్థిత్వాలను గవర్నర్ తమిళసై రిజెక్ట్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో పటాన్ చెరు అసెంబ్లీ సెగ్మెంట్లో టికెట్ల లొల్లి మళ్ళీ మొదలైంది.**

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎరుకల సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారా యణకు ముఖ్యమంత్రి కెసిఆర్ అవకాశం కల్పించి, ఎరుకల సామా జిక వర్గానికి భరోసా ఇచ్చినప్పటికీ., తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళ సై ఎమ్మెల్సీగా గవర్నర్ కోటాలో సత్యనారాయణను ఫైలును ఆమోదించకపోవడంతో పటాన్ చెరు నియోజక వర్గంలో ఒక కొత్త చర్చకు దారి తీసింది. పటాన్ చెరు నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ను కుర్ర సత్యనారాయణకే కేటాయించాలని బిసి, ఎరుకల సామాజిక వర్గీయుల నుండి నిరసన సెగ షురూ అయ్యింది. బిఆర్ఎస్ నుంచి పటాన్ చెరు అసెంబ్లీ సెగ్మెంట్ స్థానాన్ని

మిగతా 3లో...

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లలో ఘోర వైఫల్యం

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు



కరీంనగర్- ప్రభాత సూర్యుడు

గణేష్ నిమజ్జన ఏర్పాట్లలో జిల్లా అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. మరి కొద్ది గంటల్లో గణేష్ నిమజ్జనం జరగాల్సి ఉన్నప్పటికీ? ఇంతవరకు ఏర్పాట్లే పూర్తి చేయలేదని, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని అన్నారు. అధికారులు

మిగతా 3లో...

## ఆసియా కప్‌లో మరో స్వర్ణం

(మొదటి పేజీ తరువాయి)

అనుష అగర్వాల, సుదీప్తి హాజేలాతో కూడిన జట్టు 209.205 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. చైనా (204.882 పాయింట్లు), హాంకాంగ్ (204.852 పాయింట్లు)ను రజతం, కాంస్యానికి పరిమితం చేసింది.ఆసియా క్రీడల్లో ఈక్వ్‌స్ట్రియన్‌లో భారత్‌కు ఇది నాలుగో బంగారు పతకం. అంతకు ముందు మూడు స్వర్ణ పతకాలను 1982 ఆసియా క్రీడల్లో గెలుచుకుంది. సెయిలింగ్‌లో టీమ్‌ఇండియా పతకాల వేట కొనసాగుతోంది. ఇప్పటికే సెయిలింగ్‌లో నేహా ఠాకూర్ రజత పతకం గెలుచుకుంది. కొద్దిసేపటి క్రితమే మరో రెండు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. పురుషుల విభాగంలో రెండు కాంస్య పతకాలు దక్కాయి. ఎబాద్ అలీ ఆర్‌ఎస్ – చీ కేటగిరీలో, విష్ణు శరవణన్ ఐఎల్‌సీఏ విభాగంలో విష్ణు శరవణన్ కాంస్య పతకాలు అందుకున్నారు.భారత బాక్సర్ సచిన్ అదుర్స్ అనిపించాడు. రెండో రౌండ్‌లోకి ఎంటరయ్యాడు. 57 కేజీల విభాగంలో ఇండోనేషియాకు చెందిన అస్రి ఉదిన్‌పై 5–0 ఆధిక్యంతో విజయం సాధించాడు. ఇక 92 కేజీల విభాగంలో 16వ రౌండ్‌లో కర్గిస్థాన్ బాక్సర్ ఒమురబెక్‌తో భారత బాక్సర్ నరేంద్ర తలపడేందుకు సిద్ధమవుతున్నాడు. మరోవైపు ఈస్పోర్ట్స్‌లో భారత ద్వయం అయాన్ బిస్వాస్, మయాంక్ అగర్వాల్ స్ట్రీట్ ఫైటర్ నాకౌట్ రౌండ్ల నుంచి ఎలిమినేట్ అయ్యారు. టెన్నిస్‌లో సుమిత్ నగల్ మూడో రౌండ్‌లో తలపడుతున్నారు.

## లిక్కర్ స్కాంలో కవితకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కోరింది ఈడీ. దీంతో కవితకు 10 రోజులపాటూ నోటీసులను వాయిదా వేసింది ఈడీ. ఇప్పుడు మరోసారి నవంబర్ ఇరవయ్యో తేదీ వరకూ వాయిదా వేయడానికి అంగీకరించింది. గతంలో లిక్కర్ కేసులో ఈడీ నోటీసులు అందుకున్న కవిత.. ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అయితే.. ఈడీ కార్యాలయంలో మహిళల విచారణ సీఆర్పీసీకి విరుద్ధం అంటూ ఆమె మొదటి నుంచి వాదిస్తున్నారు. నళిని చిదంబరం తరహాలో ఇంటివద్దే తనను విచారణ జరపాలని ఆమె కోరుతున్నారు. ఈ క్రమంలో దర్యాప్తు సంస్థల తీరును తప్పుబడుతూ ఆమె సుప్రీంలో పిటిషన్ వేశారు.ఆ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ సాగుతోంది. అయినప్పటికీ ఈడీ మరో సారి నోటీసులు జారీ చేసింది. తన పిటిషన్ విచారణలో ఉండగా.. నోటీసులు ఎలా జారీ చేస్తారని ఈడీ తీరును ప్రశ్నించారామె. అంతే కాదు తాను విచారణకు రాలేనని ఈడీకి స్పష్టం చేశారు. కవిత బిజీగా ఉంటే నోటీసుల విషయంలో పది రోజుల సమయం పొడగిస్తామని గత విచారణలో ఈడీ కోర్టుకు తెలిపింది. ఈ క్రమంలో నేటితో పదిరోజుల గడువు ముగిసింది. విచారణ సందర్భంగా.. కవిత పిటిషన్‌పై విచారణ కొనసాగు తున్నందున తదుపరి విచారణలోపు ఎలాంటి నోటీసులు జారీ చేయొద్దని సుప్రీం కోర్టు, ఈడీకి స్పష్టం చేసింది. సిఆర్పిసి సెక్షన్ 160 ను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ఉల్లంఘించిందని కవిత తరపు న్యాయవాదులు గతంలో వాదించారు. చట్ట ప్రకారం దర్యాప్తు సంస్థలు మహిళను ఇంటి దగ్గరే విచారణ జరపాలని, కానీ వ్యక్తిగతంగా హాజరుకావాలని తనకు సెక్షన్ 50 ప్రకారం నోటీసులు జారీ చేయడం చట్ట విరుద్ధమని కవిత తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాదు వాంగ్మూలం నమోదు చేసేటప్పుడు న్యాయవాది సమక్షంలో వీడియో చిత్రీకరణకు ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టును కోరారు. అయితే పీఎంఎల్ఏ కేసుల్లోకి సెక్షన్ 160 వర్తించదని ఈడీ తరపు న్యాయవాది పేర్కొన్నారు. పి ఎం ఎల్ ఏ సెక్షన్ 50ని ధర్మాసనానికి వివరించారు. చట్ట ప్రకారం ఎవరినైనా విచారణకు పిలిచే అధికారాలు ఈడికి ఉన్నాయని ఈడి తరపు న్యాయవాది ఎస్వీ రాజు తమ వాదన వినిపించారు. నవంబర్ 20వ తేదీ వరకూ కవితను విచారణ చేయడం లేదా అరెస్టు చేయడం వంటి పరిణామాలు ఉండే అవకాశం లేదు.

## 3 నెలల్లో 90 వేల వీసాలు

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు అందరికీ అభినందనలు, శుభాకాంక్షలు అంటూ ట్వీట్ చేసింది. టీమ్ వర్క్, ఇన్నోవేషన్ తో, అర్హత కలిగిన దరఖాస్తుదారులందరూ వారి ప్రోగ్రామ్ లకు సమయానికి చేరుకున్నారని నిర్ధారిస్తున్నట్లు ట్విట్టర్ వేదికగా పోస్టు పెట్టింది. ప్రస్తుత సెషన్ కోసం స్టూడెంట్ వీసా దరఖాస్తులు ముగిసిన నేపథ్యంలో యూఎస్ మిషన్ ఈ గణాంకాలను విడుదల చేసింది.2022 లో యునైటెడ్ స్టేట్స్ లో అత్యధిక అంతర్జాతీయ విద్యార్థులతో ప్రపంచంలోని అగ్ర దేశంగా భారత్ చైనాను అధిగమించింది. 2020లో దాదాపు 2,07,000 మంది అంతర్జాతీయ భారతీయ విద్యార్థులు యూఎస్ లో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని తాజా నివేదిక ద్వారా తెలుస్తోంది. భారత దేశం నుంచి విద్యార్థులను ఆకర్షించడానికి విదేశీ విశ్వవిద్యాలయాలు అందించే సులభతరమైన అప్లికేషన్ ఫార్మాలిటీలు, ఆర్థిక సహాయం, స్కాలర్‌షిప్ లు ఈ పెరుగుదలకు కారణంగా విద్యారంగ నిపుణులు పేర్కొంటున్నారు.ఇంతకు ముందు ఫ్రాన్స్ కూడా భారత్ నుంచి సుమారు 30 వేల మంది విద్యార్థులను ఉన్నత చదువుల కోసం తమ దేశానికి స్వాగతించాలన్న లక్ష్యాన్ని వ్యక్తం చేసింది. 2030 నాటికి భారతీయ విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఆ దేశం ప్రయత్నాలు చేస్తోంది. విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడం, సాంస్కృతిక సంబంధాలను పెంపొందించడం, రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక స్నేహాన్ని పెంపొందించడం ద్వారానే ఈ లక్ష్యం సాధ్యం అవుతుందని పేర్కొంది. భారతీయ విద్యార్థులకు బ్రిటన్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. విదేశీ విద్యార్థుల నుంచి వసూల్ చేసే స్టడీ వీసా ఫీజును భారీగా పెంచేసింది. దాదాపు 127 పౌండ్ల వరకు ఫీజును పెంచారు. మనదేశ కరెన్సీలో పెంచిన మొత్తం రూ.13 వేలకు సమానం. అక్టోబర్ 4 నుంచే పెంచిన ఫీజులు అమల్లోకి రానున్నాయి. దీనిపై బ్రిటిష్ పార్లమెంట్‌లో ఇటీవల చట్టం చేశారు. స్టూడెంట్ వీసా దరఖాస్తు ఫీజును 490 పౌండ్ల వరకు వసూలు చేయనున్నట్లు యూకే హోం ఆఫీసు వెల్లడించింది. స్టూడెంట్ వీసాతోపాటు, పర్యాటకులకు ఇచ్చే విజిటింగ్ వీసా ఫీజును కూడా ప్రభుత్వం పెంచింది. విజిట్ వీసాపై 15 పౌండ్లు పెంచారు. దీంతో ఇప్పుడు ఆ వీసా ఖరీదు 115 పౌండ్లుగా మారింది. ఇది కేవలం 6 నెలల విజిట్ వీసాకు మాత్రమే. అక్టోబర్ నాలుగో తేదీ నుంచి కొత్త ఫీజులు అమలులోకి రానున్నట్లు యూకే ఇమ్మిగ్రేషన్ అధికారులు తెలిపారు. 2021–2022 సీజన్‌లో భారత్ నుంచి సుమారు లక్షా 20 వేల మంది చదువు కోసం బ్రిటన్ వెళ్లారు. ఆ దేశంలో విద్యను అభ్యసిస్తున్న విదేశీయుల్లో ఇండియన్ల సంఖ్యే ఎక్కువ. కీలకమైన సేవల్ని అందించేందుకు ఉద్దేశంతో ఫీజును పెంచినట్లు ప్రభుత్వం పేర్కొంది.

# తెలంగాణ కమలంలో.. గ్రాఫ్ పడిపోతోంది..!

(మొదటి పేజీ తరువాయి)

తగిన గుర్తింపు ఇవ్వకుండా అవమానిస్తున్నారని అభిప్రాయ పడుతున్నారు. తమను సంప్రదించకుండా... కొందరిని బీజేపీలో చేర్చుకోవడం కూడా వారి ఆగ్రహానికి ఆజ్యం పోసింది. వారంతా బీజేపీ జాతీయ నాయకత్వంపై గుర్రుగా ఉన్నట్టు తెలుస్తోంది. అంతేకాదు.. లిక్కర్ స్కామ్‌లో కవితను అరెస్ట్ చేయకపోవడం.. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టకపోవడం కూడా బీఆర్ఎస్‌కు ప్లస్‌గా మారుతుందని వారి అభిప్రాయం. దీనిపై అధిష్టానం పట్టించుకోవడంలేదన్నది.. అసంతృప్త వర్గం నేతల వాదన. బీజేపీలోని ఆ అసంతృప్త నేతలంతా తరచూ రహస్య సమావేశాలు నిర్వహించడం.. హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల రెండు, మూడు సార్లు సమావేశమైన నేతలు.. ఆదివారం నగర శివార్లలోని ఓ ఫామ్‌హౌస్‌లో మీటింగ్ పెట్టకున్నారని సమాచారం. ఈ సమావేశానికి జాతీయ కార్యవర్గ సభ్యుడు జి.వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, విజయశాంతి, మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జి.విజయరామారావుతోపాటు పలువురు నేతలు హాజరైనట్టు తెలుస్తోంది. త్వరలోనే వీరంతా ఢిల్లీ వెళ్లి అమిత్‌షాతోపాటు పార్టీ పెద్దలను కలిసి తమ అభిప్రాయాలను వ్యక్త పరచాలని భావిస్తున్నారట. జాతీయ నాయకత్వం అనుకూలంగా స్పందించకపోతే... తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారట. పార్టీ వీడేందుకు కూడా సిద్ధమే అన్న సంకేతాలను పార్టీ పెద్దలకు ఇచ్చే ఆలోచనలో ఉన్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. బీజేపీ అసంతృప్త నేతలంతా ఇప్పటికే కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. బీజేపీ అధిష్టానంతో చర్చించిన తర్వాత... వారి రియాక్షన్ ఎలా ఉంటుందో చూసుకుని... అవసరమైతే కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యేందుకు కూడా గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నట్టు తెలుస్తోంది. అందుకే.. బీజేపీలోని కీలక నేతలు కూడా తమతో టచ్‌లో ఉన్నారని.. రాబోయే కాలంలో కాంగ్రెస్‌లోకి చేరికలు పెరుగుతాయని టీపీసీసీ నేతలు పదే పదే ప్రకటిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ ఏం చేయబోతోంది...? అసంతృప్తులను బుజ్జగిస్తుందా? లేదా... పోతేపోని అని వదిలేస్తుందా..? అనేది ఉత్కంఠగా మారింది.

### రంగంలోకి ప్రధాని మోడీ

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. దీంతో భారతీయ జనతా పార్టీ అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. దీనిలో భాగంగా వ్యూహాలకు పదును పెట్టిన బీజేపీ అధిష్టానం.. తెలంగాణ నేతలకు కీలక సూచనలు చేసింది. ఎన్నికలకు సమయం లేదని.. ఇక స్పీడును పెంచాలంటూ అధిష్టానం ఆదేశించింది. దీని ప్రకారమే భారతీయ జనతా పార్టీ నేతలు వరుస కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అంతేకాకుండా, అగ్రనేతలు సైతం తెలంగాణ బాట పడుతూ ఎప్పటికప్పుడు కాషాయ పార్టీ నేతలను సమాయత్తం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం హైదరాబాద్ లో పర్యటించారు. తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొన్న అమిత్ షా.. నేతలతో భేటీ అయి ఎన్నికల కార్యచరణపై చర్చించారు. అంతేకాకుండా.. అధిష్టానం సూచనలను తప్పక పాటించాలని.. ఐకమత్యంతో ముందుకెళ్లాలని.. ఇకపై అగ్రనేతలంతా ఎప్పటికప్పుడు తెలంగాణలో పర్యటిస్తారని కూడా హామీనిచ్చారు. అయితే, బీజేపీ వ్యూహంలో భాగంగా అగ్రనేతలంతా తెలంగాణకు క్యూకట్టనున్నారు. అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో.. ఏకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సైతం రంగంలోకి దిగుతున్నారు. అక్టోబరు 1న మహబూబ్‌నగర్ వేదికగా ప్రధాని మోడీ ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపడంతోపాటు.. ఎన్నికలకు సిద్ధమయ్యేలా పలు సూచనలు చేయనున్నారు. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు సంబంధించి ఇప్పటికే టూర్ షెడ్యూల్ ఖరారు అయ్యింది.అక్టోబర్ 1న మధ్యాహ్నం 12.30 గంటలకు మహబూబ్‌నగర్ పట్టణ శివార్లలోని భూత్‌పూర్‌లో జరిగే బహిరంగ సభలో ప్రధాని మోడీ ప్రసంగించి అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. మోడీ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ భారీ జనసమీకరణకు ప్లాన్ చేస్తోంది. అయితే, ప్రధాని మోడీ సభ ఎన్నికలకు ముందు కీలకం కానుంది. ఓ వైపు సభతో పార్టీ కేడర్‌ను సమాయత్తం చేయడం.. మరోవైపు నేతలకు కీలక సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే టార్గెట్‌గా ప్రధాని మోదీ ప్రసంగం ఉండే అవకాశం కనిపిస్తోంది. ప్రధాని మోదీ సభ తర్వాత బీజేపీ కూడా అభ్యర్థుల జాబితాను పార్టీ అధిష్టానం వెల్లడించే ఛాన్స్ ఉంది. ప్రధాని మోడీతోపాటు.. బీజేపీ అగ్రనేతలు హోంమంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా త్వరలో జరిగే సమావేశాల్లో పాల్గొన నున్నారు. మోడీ సభ అనంతరం 17 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో, 119 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పార్టీ బహిరంగ సభలకు ప్లాన్ చేస్తోంది.వాస్తవానికి మొదట సెప్టెంబర్ 28, 29 తేదీల్లోనే ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటిస్తారని అందరూ భావించారు. కానీ అది వచ్చేనెలకు ఖరారు చేశారు. తొలుత అక్టోబరు 2న టూర్ ఖరారు చేసినా.. చివరికి షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేస్తూ ఒకటవ తేదీన మహబూబ్‌నగర్ సభలో పాల్గొంటారని తెలిపారు. పాలమూరులో ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేసే దిశగా రాష్ట్ర నాయకత్వం కార్యాచరణ సిద్ధం చేస్తూ.. కమిటీలను సిద్ధం చేస్తోంది. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను మోడీ సభకు తరలించేలా ప్లాన్ రచిస్తున్నారు.

## పాలమూరులో కాలు పెట్టే నైతిక హక్కు మోడీకి లేదు

(మొదటి పేజీ తరువాయి)

కోర్టులో కృష్ణా జలాల వాటా కోసం న్యాయ పోరాటం చేశామని ఆయన పేర్కొన్నారు. 575 టీఎంసీల వాటా తెలంగాణకు రావాలి.. మోడీ ఇప్పుడైన పాప పరిహారం చేసుకుండి.. పాలమూరు ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఇవ్వండి.. వచ్చే ఎన్నికల్లో ఈ సారి కూడా 110 స్థానాల్లో బీజేపీకి డిపాజిట్లు పోతాయని కేటీఆర్ తెలిపారు.మనసుతో ఆలోచించి ఉంటే గవర్నర్ తమిళిసై నిర్ణయం ఇలా ఉండేది కాదు అని మంత్రి కేటీఆర్ అన్నారు. గవర్నర్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయి.. మరి ఈ ఇద్దరు అన్ ఫిట్ అన్నారు.. మరి మీరు అన్ ఫిట్ ఆ.. లేక మోడీ అన్ ఫిట్.. ఆ అని కేటీఆర్ ప్రశ్నించారు. రాజకీయ పార్టీతో సంబంధం ఉంటే.. తప్పు ఏంటీ?.. గవర్నర్ తీరును ఖండిస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికలు వస్తే.. కొంత మంది వస్తారు.. కొంత మంది పోతారు.. అది పెద్ద విషయం కాదు.. గవర్నర్ విషయంలో మాకు ఉన్న అన్ని ఆప్షన్ లు చూస్తామని కేటీఆర్ చెప్పారు.10 ఏళ్ల నుంచి కృష్ణా జలాల్లో వాటా తేల్చడం లేదని.. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల్లో ఒక్కదానికి కూడా జాతీయ హోదా ఇవ్వడం లేదన్నారు. కృష్ణా జలాల్లో వాటా తేల్చాకే పాలమూరు రావాలన్నారు. తెలంగాణకు ద్రోహం చేసిన పార్టీ బీజేపీ .. ఓట్లు కావాలంటే ప్రధానికి మంచి పనులు చేసే సత్తా ఉండాలన్నారు. ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా.. ప్రజలు నమ్మరని అన్నారు. ఇద్దరిని ఎమ్మెల్సీలుగా సిఫార్సు చేశాం.

ఒకరు ప్రొఫెసర్, మంచి వ్యక్తి అని ఆమోదిస్తారని అనుకున్నాం.. మరొకరు ట్రేడ్ యూనియన్‌లో సేవలు చేస్తున్న సత్య నారాయణ..అయితే, మోదీ ఎజెండాగా తెలంగాణ గవర్నర్ పనిచేస్తున్నారని మండిపడ్డారు. గవర్నర్ అయ్యే ఒక్కరోజు ముందు కూడా తమిళిసై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలుగా పని చేశారు. ఆమెను నియమించడం సర్కారియా కమిషన్ నిబంధనలకు విరుద్ధమన్నారు. గవర్నర్ వ్యవస్థ దేశంలో అవసరమా..? గవర్నర్ వ్యవస్థ బ్రిటిష్ కాలం నాటి వ్యవస్థ అంటూ ప్రశ్నించారు. గవర్నర్ వ్యస్థను తీసేస్తారా.. ప్రధాని హోదాని వైస్రాయ్ చేస్తారా.. రెండు జాతీయ పార్టీలు తెలంగాణపై పగబట్టాయి. మాస్టర్ ఆఫ్ అటెన్షన్ డైవర్షన్ అంటూ ఎద్దేవ చేశారు.

## చంద్రబాబు పిటీషన్లు వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

పిటిషన్‌పై చంద్రబాబు తరపు న్యాయవాదులు దూబే, దమ్మాలపాటి శ్రీనివాస్ కౌంటర్ దాఖలు చేశారు. కేసు విచారణను ఇన్‌చార్జి న్యాయమూర్తి రేపటికి వాయిదా వేశారు. కాగా, బెయిల్ పిటిషన్ అంశాన్ని చంద్రబాబు తరపు న్యాయవాదులు ప్రస్తావించగా.. రేపు కోర్టులో కోరాలని న్యాయమూర్తి సూచించారు.మరోవైపు, నేడు విజయవాడ ఏసీబీ కోర్టు జడ్జి సెలవులో ఉన్నారు. దీంతో ఏసీబీ కోర్టు ఇన్‌ఛార్జి జడ్జిగా మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వ్యవహరించారు. చంద్రబాబు బెయిల్, కస్టడీ పిటిషన్లను విచారణ చేయాలని న్యాయవాదులు ఇన్‌ఛార్జి జడ్జిని కోరారు.ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో ఏ14 గా లోకేష్‌ఏపీలో ఇప్పుడు కేసులు, అరెస్టుల పర్వం నడుస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే అరెస్ట్ అవగా.. ఇప్పుడు నారా లోకేష్ పేరు హాట్ టాపిక్‌గా మారింది. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఏ 14గా నారా లోకేష్ పేరును చేర్చింది సీఐడీ. ఏసీబీ కోర్టులో లోకేష్ పేరును మెన్షన్ చేస్తూ సీఐడీ మెమో దాఖలు చేసింది. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ స్కామ్‌లో ఇప్పటికే చంద్రబాబుపై కేసు నమోదు చేసింది సీఐడీ.. ఇప్పుడు నారా లోకేష్ పేరును కూడా చేర్చడం సంచలనంగా మారింది. ఇక ఈ కేసులో మాజీ మంత్రి నారాయణతో పాటు మరికొందరిపైనా అభియోగాలు ఉన్నాయి. వరుస కేసులతో టీడీపీ ఉక్కిరిబిక్కిరి అయిపోతుంది. మరి తదుపరి అరెస్ట్ నారా లోకేష్ దేనా అనేది చర్చనీయాంశంగా మారింద.సుప్రీంకోర్టులో చంద్రబాబు పిటిషన్, బుధవారం విచారణ..చంద్రబాబు అరెస్టు అయినప్పటి నుంచి స్కిల్ స్కామ్ కేసు నుంచి బయటపడేందుకు న్యాయపరంగా ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించు కుంటున్నారు. అయితే.. క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టే యడంతో ఇప్పుడు సుప్రీంకి వెళ్లారు. చంద్రబాబు తరపున న్యాయవాదులు దాఖలు చేసిన మెన్షన్ మెమోపై నిర్ణయం తీసుకున్న సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్.. బుధవారం విచారణ చేపడతామని తెలిపారు. కాగా, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండానే స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబుపై కేసు నమోదు చేశారని, ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ పిటిషన్‌లో పేర్కొన్నారు.స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన చంద్రబాబుకు బెయిల్ ఇవ్వాలంటూ ఆయన తరఫున న్యాయవాదులు బెయిల్ పిటిషన్ వేయగా.. ఈ కేసులో ఇంకా విచారించాల్సిన అవసరం ఉందని, బాబును తమ కస్టడీకి ఇవ్వాలంటూ సీఐడీ తరఫున న్యాయవాదులు కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణను రేపటికి వాయిదా వేసింది ఏసీబీ కోర్టు. కస్టడీ పిటిషన్‌పై చంద్రబాబు లాయర్లు కౌంటర్ దాఖలు చేయగా.. దానిపై విచారణ బుధవారమే చేపడతామని స్పష్టం చేసింది కోర్టు. కాగా, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో ఇప్పటికే చంద్రబాబును 2 రెండు రోజుల కస్టడీకి తీసుకుంది సీఐడీ. అయితే, సరైన సమాచారం రాలేదని, విచారించాల్సిన అవసరం ఉందంటూ సీఐడీ మరో 5 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేసింది.

## జగన్ది ఫ్యాక్షన్ కక్ష..!

(మొదటి పేజీ తరువాయి)

ఎ14గా నారా లోకేష్ పేరుని చేర్చుతూ ఏసీబీ కోర్టులో సీఐడీ మెమో దాఖలు చేయడంపైనా టిడిపి నేతలు చర్చించారు. లోకేష్కి ఇన్నర్ రింగ్ రోడ్డుకి సంబంధించిన శాఖ కాకపోయినా, అసలు ఇన్నర్ రింగ్ రోడ్డు అనేది వేయకపోయినా, ఇందులో స్కాం అంటూ కేసు నమోదు చేసి..అందులో ఎ14గా నారా లోకేష్ పేరు చేర్చారంటేనే...ఇది ముమ్మాటికీ జగన్ రెడ్డి మార్క్ ఫ్యాక్షన్ కక్షసాధింపుయేనని నేతలు అభిప్రాయపడ్డారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఎటువంటి ఆధారాలు లేకపోయినా చంద్రబాబు గారిని అరెస్టు చేసినట్టే, లోకేష్ని సంబంధమే లేని కేసులో ఇరికించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ఎన్ని కేసులు పెట్టుకుని వేధించినా, ధర్మం టిడిపి పక్షాన ఉందని, న్యాయపోరాటం ద్వారా ఎదుర్కొందాం అని తీర్మానించారు. యువగళం మళ్లీ ప్రారంభిస్తానని లోకేష్ ప్రకటించిన నేపథ్యంలో .. ఎలాగైనా పాదయాత్రని అడ్డుకోవాలని ఈ తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని టిడిపి నేతలు మండిపడ్డారు. అరాచక వైసీపీ పాలనపై తెలుగుదేశం పార్టీ తలపెట్టిన జనచైతన్య కార్యక్రమాలు ఏ ఒక్కటీ ఆగవని, ఎన్ని అడ్డంకులు కల్పించినా యువగళం ఆగదని, ధర్మం టిడిపి వైపు ఉందని, న్యాయపోరాటంలో విజయం సాధిస్తామని టిడిపి ఎంపీలు, నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఏపి లో జరుగుతున్న కక్ష సాధింపు రాజకీయం జాతీయ స్థాయిలో ఎండగట్టాలని, మన వైపు న్యాయం ఉంది, ఏ తప్పూ చేయలేదు అనడానికి ఆధారాలు ఉన్నాయి. వీటిని జాతీయ స్థాయిలో అందరికీ తెలిసే విధంగా పోరాడాలని లోకేష్ ఎంపీలకు మార్గనిర్దేశం చేశారు. జగన్ ప్రభుత్వం పెడుతున్న తప్పుడు కేసులు – నిజాలు వివరిస్తూ టిడిపి తయారు చేసిన పుస్తకాలు పంపిణీ చేసి జాతీయ మీడియా, జాతీయ నాయకులకి ఏపి లో జరుగుతున్న అరాచక పాలన గురించి వివరించాలని లోకేష్ ఎంపీలతో అన్నారు.

### రేవంత్ రెడ్డి సమక్షంలో చేరికలు

**హైదరాబాద్- ప్రభాత సూర్యుడు:** నాగర్ కర్నూల్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆరెస్ నుంచి కాంగ్రెస్ లో చేరారు. వీళ్లందరికి టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి తన నివాసంలో కండూవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైస్ ఎంపీపీ నిర్మల, ఎంపీటీసీలు కృష్ణయ్య, శ్రీను, రాజు, మల్లయ్య, మాజీ ఎంపీటీసీలు రమణారావు, శాంతయ్య, సర్పంచ్ స్వామి, ఉపసర్పంచ్ భగవంత్ గౌడ్, ఖంఅూ డైరెక్టర్లు రామచంద్ర రావు, తిరుపతయ్య, మాజీ సర్పంచులు నర్సింహా, బుచ్చన్న, కుర్మయ్య, కౌన్సిలర్ శ్రీనివాసులు, ఇతర కార్యకర్తలు కాంగ్రెస్ లో చేరారు.

## సంపాదకీయం

# ఇండియాలో మొదలైన తలనొప్పులు


ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని గద్దె దించడమే ప్రధాన లక్ష్యంగా జట్టుకట్టిన విపక్ష కూటమి లో ఐక్యత మేడిపండు సామెతను తలపిస్తోంది. భారతీయ జనతా పార్టీని ఓడించడమే కూటమిలోని అన్ని పార్టీల ఉమ్మడి లక్ష్యమైనప్పటికీ.. సీట్ల సర్దుబాటు విషయంలో ఏ ఒక్కరూ రాజీపడే ప్రసక్తే లేదన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు. 'వేదికపై నేతల చేతులు కలుస్తున్నాయి తప్ప.. మనసులు మాత్రం కలవవు' అని గతంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి వ్యాఖ్యానించినట్టుగానే కూటమిలో వివిధ పార్టీల మధ్య పరిస్థితి నెలకొంది. ఆ రాష్ట్రంలో గెలిస్తే ఢిల్లీ పీఠాన్ని అధిరోహించవచ్చు అని చెప్పుకునే ఉత్తర్‌ప్రదేశ్‌లోనే ఈ పరిస్థితి నెలకొంది. 80 స్థానాలున్న ఈ రాష్ట్రంలో ఆధిపత్యం కోసం సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీల మధ్య పోరు నెలకొంది. తాము విపక్ష కూటమి నుంచి సీట్లు కోరుకోవడం లేదని, ఉత్తర్‌ప్రదేశ్‌లో కూటమి సభ్యులకు తామే సీట్లు ఇస్తామని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సరికొత్త చర్చకు దారితీశాయి. ఇండియన్ నేషనల్ డెవలప్మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ పేరుతో జట్టుకట్టిన విపక్షాలు తమ ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరో చెప్పలేని పరిస్థితిలో ఉన్నారంటూ బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలకు తోడు.. ఉన్న కూటమిలో ప్రాంతీయ పార్టీలు తమ తమ రాష్ట్రాల్లో ఆధిపత్యం తమదేనని చాటుకునే యత్నాలు చేస్తున్నాయి. తాజాగా అఖిలేష్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు ఈ కోవలోనే పరిగణించాల్సి ఉంటుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రాంతీయ పార్టీల్లో సమాజ్‌వాదీ పార్టీయే బలంగా ఉంది. జాతీయ పార్టీ కాంగ్రెస్ ప్రభావం ఆ రాష్ట్రంలో సోనియా, రాహుల్ గాంధీలు పోటీ చేస్తూ వచ్చిన రాయ్‌బరేలీ, అమేథీ మినహా మరెక్కడా లేదు. 2019లో అమేథీలో రాహుల్ గాంధీ సైతం ఓడిపోయిన విషయం తెలిసిందే. సమాజ్‌వాదీ తర్వాత బలంగా ప్రాంతీయ పార్టీల్లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఉన్నప్పటికీ.. ఆ పార్టీ ఇండి-కూటమిలో చేరలేదు. మరో ప్రాంతీయ పార్టీ రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్డీ) ప్రభావం యూపీ పశ్చిమ ప్రాంతంలో జాట్ వర్గం ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకే పరిమితం. ఈ స్థితిలో ఆ రాష్ట్రంలో సీట్ల సర్దుబాటులో బలహీనంగా ఉన్న కాంగ్రెస్ బలమైన సమాజ్‌వాదీ, ఆల్ఎల్డీలపై పెత్తనం చేస్తానంటే ఒప్పుకునే పరిస్థితి ఉండదు. అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యలు ఈ స్థితి నుంచే ఉద్భవించాయి. యూపీలోని 80 సీట్లలో ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో.. ఎక్కడెక్కడ పోటీ చేయాలో నిర్ణయించేది తానేనని తేల్చి చెప్పేశారు. అంటే ఇండి-కూటమిలో ఉత్తర్‌ప్రదేశ్ జట్టు కెప్టెన్ తానేనని తనకు తానే ప్రకటించుకున్నారు. తద్వారా కూటమిపై ఒత్తిడి పెంచారు. అఖిలేష్ యాదవ్ ఉత్తరప్రదేశ్‌లో తన పట్టును మరెవరికీ ఇచ్చే మానసిక స్థితిలో లేడు. రాష్ట్ర రాజకీయాల్లో పునరాగమనం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. సమాజ్‌వాదీ పార్టీ పట్టు సడలితే కాంగ్రెస్ పుంజుకుంటుంది. అది సమాజ్‌వాదీని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేస్తుంది. అందుకే టీమ్-యూపీ కెప్టెన్ తానేనని పరోక్షంగా ప్రకటించుకున్నారు. అంతేకాదు, త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుపుకోనున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ ఆయన సమాజ్‌వాదీ పార్టీ నుంచి అభ్యర్థులను ప్రకటించారు. ఈ రాష్ట్రాల్లో పెద్దన్న స్థితిలో ఉన్న కాంగ్రెస్ సైకిల్ పార్టీ సమాజ్‌వాదీకి చోటు కల్పించే విషయంలో మీనమేషాలు లెక్కిస్తుండడమే ఇందుకు కారణం. ఉత్తరప్రదేశ్‌లో విపక్ష కూటమి భాగస్వామ్య పార్టీలు సమాజ్‌వాదీ, రాష్ట్రీయ లోక్‌దళ్ కాంగ్రెస్‌తో పాటు కృష్ణపటేల్ వర్గానికి చెందిన అప్నాదళ్, దళిత ఉద్యమ నేత చంద్రశేఖర్ ఆజాద్ పార్టీ కూడా ఉన్నాయి. యూపీలోని డజను లోక్‌సభ స్థానాల్లో ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆర్ఎల్డీ సిద్ధమవుతుండగా, కాంగ్రెస్ కూడా రెండు డజన్ల స్థానాలను గుర్తించింది. రాష్ట్రంలో ఉన్న మొత్తం 80 లోక్‌సభ స్థానాల్లో ఆర్ఎల్డీ, కాంగ్రెస్ కలిసి 3 డజన్లు పంచేసుకుంటే సమాజ్‌వాదీకి మిగిలేవి సగం సీట్లు మాత్రమే. అందుకే సీట్ల పంపకాల ఫార్ములాను తన చేతుల్లోనే ఉంచుకోవాలని సమాజ్‌వాదీ భావిస్తోంది. యూపీలోని 80 లోక్‌సభ స్థానాల్లో 50 నుంచి 55 స్థానాల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. కాంగ్రెస్‌కు పెత్తనం ఇస్తే 40 సీట్లకు మించి దక్కే పరిస్థితి కనిపించడం లేదు. కూటమిలో సీట్ల పంపకం ఫార్ములా ఇంకా ఖరారు కానప్పటికీ, 2024 ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉన్న పార్టీ నేతలకు అఖిలేష్ యాదవ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. లోక్‌సభ స్థానాలకు సమాజ్‌వాదీ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తోంది. పరోక్షంగా వారినే అభ్యర్థులుగా తెరపైకి తెస్తోంది. ఆ ఇంచార్జులు నిరంతరం క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. జాతీయస్థాయిలో చూస్తే ప్రతిపక్ష కూటమిలో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీ. కానీ ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో చూస్తే సమాజ్‌వాదీ పార్టీయే ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. యూపీలో ఎస్పీ కచ్చితంగా కాంగ్రెస్‌తో పొత్తు కొనసాగిస్తుంది. కానీ పెత్తనం మాత్రం ఆ పార్టీ చేతిలో పెట్టాలనుకోవడం లేదు. ఏమాత్రం పట్టుజారినా.. 90వ దశకంలో కాంగ్రెస్ నుంచి విడిపోయి సమాజ్‌వాదీకి బలమైన ఓటుబ్యాంకుగా మారిన ముస్లిం ఓటర్లు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకుంటారు. తద్వారా ఎస్పీ ఒక్కసారిగా బలహీనపడుతుంది. అందుకే ఆర్ఎల్డీ, కాంగ్రెస్‌లకు పొలిటికల్ గ్రౌండ్ ఎంత ఉందో అంత పొలిటికల్ స్పేస్ ఇవ్వాలని అఖిలేష్ యాదవ్ భావిస్తున్నారు. అంతే కాదు యూపీ వెలుపల కూడా తన రాజకీయ పునాదిని విస్తరించుకునే పనిలో ఆయన బిజీగా ఉన్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా పార్టీ సిద్ధమవుతోంది. మధ్యప్రదేశ్‌లోని నాలుగు స్థానాల్లో ఎస్పి తన అభ్యర్థుల పేర్లను ప్రకటించగా, రాజస్థాన్‌లో రాజ్‌గఢ్-లక్ష్మణ్‌గఢ్ అసెంబ్లీ నుండి మాజీ ఎమ్మెల్యే సూరజ్‌భన్ ధంకాను అభ్యర్థిగా ప్రకటించింది. ముంబయిలో జరిగిన విపక్ష కూటమి సమావేశంలోనే ఎస్పీ సీట్ల పంపకాల అంశాన్ని లేవనెత్తింది. వీలైనంత త్వరగా ఫార్ములాను నిర్ణయించాలని కోరింది. అయితే ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత సీట్ల పంపకంపై చర్చించాలని కాంగ్రెస్ భావిస్తోంది. సీట్ల పంపకం విషయంలో యూపీలో కాంగ్రెస్ కు సీట్లు ఇవ్వడమే కాకుండా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్ ఎన్నికలకు కూడా సీట్లు వస్తాయని అఖిలేష్ యాదవ్ వ్యూహం. కాగా, అసెంబ్లీ ఎన్నికల తర్వాత సీట్ల పంపకం జరిగితే.. రాష్ట్రాల్లో సీట్లు ఇవ్వాల్సిన అవసరం ఉండదన్నది కాంగ్రెస్ వ్యూహం. ఇలాంటి పరిస్థితుల్లో అఖిలేష్ యాదవ్ వేసిన ఎత్తుగడను చూస్తే దీని వెనుక కాంగ్రెస్‌పై ఒత్తిడి తేవాలనే వ్యూహం దాగి ఉందని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. ఈ చెక్‌మేట్ గేమ్‌లో ఎవరు గెలుస్తారో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే..!

# ఘనంగా చాకలి ఐలమ్మ 128వ జయంతి

## తెలంగాణ పోరాటయోధుల్ని స్మరించుకునే ముఖ్యమంత్రి కేసీఆర్

## రవీంద్రభారతిలో వేడుకల్లో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా బిసిల సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు బిసి వీరుల ఆత్మగౌరవం ప్రతిఫలించేలా స్మరించుకుంటుందన్నారు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్. ఈరోజు ప్రభుత్వ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో అంగరంగ వైభవంగా నిర్వహించిన చిట్యాల ఐలమ్మ 128వ జయంతి వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలనం చేసి ఐలమ్మ చిత్రపటానికి పూల మాల సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు టూరిజం కార్పోరేషన్ ఛైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, బిసి కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం, సభ్యులు ఉపేంద్ర, కిషోర్, జయంతి కమిటీ ఛైర్మన్ అక్కరాజు శ్రీనివాస్ పెద్ద ఎత్తున రజక సంఘం ప్రతినిధులు, ఐలమ్మ అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ 128 ఏళ్ల క్రితం తెలంగాణలో పోరాటాల దీవిటీ జన్మించిందని, చిట్యాల ఐలమ్మ ఏ ఒక్క కులానికో పరిమితం చేయవద్దని, ఆమె యావత్ తెలంగాణ ఆస్థి అని కొనియాడారు మంత్రి గంగుల. నాడే భూస్వాములకు ఎదురొడ్డి పోరాడి తన ఆత్మగౌరవం కోసం గొప్ప పోరాటం చేసారని ఘనంగా స్మరించుకున్నారు, అంతటి వీరవనిత చరిత్ర ప్రజలకు తెలియకుండా సమైక్య పాలకులు చేసిన కుట్రలు హేయమన్నారు. మరుగున పడ్డ చాకలి ఐలమ్మ విశిష్ట్యాన్ని తెలిపేలా గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు పోరాటానికి స్ఫూర్తిగా ఐలమ్మను నిలిపారన్నారు. 120 ఏళ్ల పాటు గుర్తింపుకు నోచుకోని ఐలమ్మ జయంతి, వర్థంతి త్సవాలను అధికారికంగా నిర్వహించే జీవోను తన బిసి మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు మంత్రి గంగుల. బిసిలు అనాదిగా పాలకుల నిర్లక్ష్యంతో వెనుకకు నెట్టేయబడ్డారని ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి గంగుల, ముఖ్యమంత్రి కేసీఆర్ గారి సారథ్యంలో బిసిలకు దొరుకుతున్న సముచిత గౌరవానికి ధన్యవాదాలు తెలిపారు. ఎకరా వందకోట్లు విలువ చేసే కోకాపేట్, ఉప్పల్ భగాయత్ లాంటి చోట్ల వేలకోట్ల విలువైన 87.3 ఎకరాలను 41 బిసి సంఘాలకు కేటాయించారని సంతోషం వ్యక్తం చేసారు. గతంలో ఉమ్మడి పాలకులకు దరఖాస్తు ఇచ్చి దండం పెట్టినా 5గుంటల జాగా ఇవ్వలేని నాటి పరిస్థితులను సబికులకు వివరించినప్పుడు సభా ప్రాంగణం గంభీరంగా మారిపోయింది. నాడు 19 ఉన్న బిసి గురుకులాలను 327కు పెంచి ప్రపంచస్థాయి విద్యను అందిస్తుంటే, కులవృత్తులు చేసుకొనే బిసిలు తమ బిడ్డలు ఇంట్లో ఇంగ్లీష్లో మాట్లాడుతుంటే ఉప్పొంగిపోతున్నారని, ఈ ఆనందం కోసమే సీఎం కేసీఆర్ గారు తెలంగాణ సాధించి దిగ్విజయంగా అభివృద్ది చేస్తున్నారన్నారు. బొంబాయి, కొల్ కతా తదితర ప్రాంతాలనుండి వచ్చి అత్యాధునికంగా దోబీనిర్వహిస్తుంటే మనవారు వెనుకబడుతున్నారని, దాన్ని పారద్రోలడానికి బిసి కులవృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో ప్రోత్సాహ మిస్తున్నారన్నారు. కళ్యాణలక్ష్మి వంటి పథకాలతో బిసిలు అప్పుల ఊబిలో చిక్కకుండా ఉన్నారని, కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న ప్రతీ సంక్షేమ కార్యక్రమంలో బిసిలకు మెజార్టీ వాటా దక్కుతుందని అన్నారు మంత్రి గంగుల కమలాకర్. మనకోసం ఇంత చేస్తున్నవారిని మర్చిపోకూడదని ఎన్నికల సమయంలో వచ్చి అరచేతిలో స్వర్గం చూపించేవారి మాయలో పడకుండా, మన కడుపునింపే కేసీఆర్ గారికి ప్రతీ ఒక్కరం ఎన్నికల ద్వారా దీవెనార్థులియ్యాలన్నారు మంత్రి గంగుల కమలాకర్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిసి కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం మాట్లాడుతూ అణగారిన వర్గాలనుండి పేదరికం నుండి వచ్చిన మంత్రి గంగుల కమలాకర్ దాన్నేప్పుడూ మర్చిపోలేదని, మూలాలను మరవకుండా అనునిత్యం తన చుట్టూ బిసి వర్గాలను మంచిగా చూసుకుంటారన్నారు, కరీంనగర్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతూ నాడే ప్రతీ బిసి కులానికి స్థలాలు కేటాయించారన్నారు. ఈ క్రుషిని గుర్తించే ముఖ్యమంత్రి కేసీఆర్ గారు మంత్రిని చేసారని, అది బిసి కులాల అధ్రుష్టమన్నారు. నేడు భూమికోసం, భుక్తికోసం, విముక్తి కోసం పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మను ఘనంగా స్మరించుకొనే అవకాశం కేవలం కేసీఆర్ గారి వల్లే దక్కిందన్నారు. సీఎం, మంత్రి క్రుషితో బిసిలు సంఘటితం అవుతున్నారని, దాన్ని కొనసాగించానలని ఐక్యంగా ఉంటేనే గుర్తింపు ఉంటుందన్నారు వకుళాభరణం కృష్ణమోహన్ రావ్, ఈ కార్యక్రమానికి ఛైర్మన్గా అధ్యక్షత వహించిన అక్కరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కరీంనగర్లోనే మాడ్రన్ దోబీఘాట్ల నిర్మాణానికి తొలుత చొరవ చూపిన మంత్రి గంగుల కమలాకర్ గారని ధన్యవాదాలు తెలిపారు. చాకలి ఐలమ్మనే తెలంగాణ ఉధ్యమానికి స్ఫూర్తని ముఖ్యమంత్రి గారు చెప్పిన విషయం గుర్తించుకోవాలని, కులంతో పాటు ఉద్యమానికి గుర్తింపు తెచ్చిన చిట్యాల ఐలమ్మ జీవితాన్ని పాఠ్యాంశంలో చేర్చి గౌరవించారని, బిసిల కోసం ముఖ్యంగా రజకుల కోసం తెలంగాణ ప్రభుత్వం 250 యూనిట్ల ఉచితకరెంట్, దోబీఘాట్లు, ఆత్మగౌరవ భవనం తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేసారు.

# పటాన్‌చెరు బిఆర్ఎస్‌లో టికెట్ లొల్లి

(మొదటిపేజీ తరువాయి)

నీలం మధు ముదిరాజ్ ఆశించి దక్కకపోవడంతో, బీసీ సంఘాల, ముదిరాజ్ వర్గాల నుండి వ్యతిరేకత మూట కట్టుకోవాల్సి వచ్చింది. తాజాగా ఎమ్మెల్సీగా కుర్ర సత్యనారాయణ అభ్యర్థిత్వం రిజెక్ట్ కావడంతో మళ్లీ ఎరుకల సామాజిక వర్గం నుండి నిరసనలు, వ్యతిరేకత మొదలయ్యాయి. దీంతో పటాన్చెరువు నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ లొల్లి సీఎం కేసీఆర్ కు కొత్త తలనొప్పిగా మారింది. పార్టీ నుంచి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి తిరిగి కేటాయించడంతో నియోజకవర్గ బీసీ సంఘాల నుంచి పెద్ద ఎత్తున నిరసన సెగలు వెల్లువెత్తుతున్నాయి. రెండు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా గూడెం మహిపాల్ రెడ్డి ఉన్నా, నియోజకవర్గంలో అవినీతి ఎమ్మెల్యేగా, అనతి కాలంలోనే వేలకోట్ల రూపాయలు అక్రమార్గంలో సంపాదించి నియోజకవర్గంలోని ప్రజలను పట్టించుకోకుండా, స్థానికంగా ఉన్న కంపెనీల యజమానులను బెదిరించి, భూ కబ్జాలు చేస్తూ అవినీతి, ఆరోపణలు మూట కట్టుకున్న గూడెం మహిపాల్ రెడ్డికి తిరిగి బీఆర్ఎస్ టికెట్ ఇస్తే ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని, అందుకే బీసీ వర్గానికి చెందిన ముదిరాజ్ బిడ్డ నీలం మధుకు బిఆర్ఎస్ పార్టీ టికెట్టును కేటాయించాలని, నియోజకవర్గం లో అన్ని బీసీ కుల సంఘాలు రోడ్డెక్కి, ధర్నాలు చేస్తున్నారు. ఈ వ్యవహారంతో కెసిఆర్, హరీష్ రావు, కేటీఆర్ లపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యలో గవర్నర్ కోటాలో కుర్ర సత్యనారాయణ ఎమ్మెల్సీ ఫైలు రిజెక్ట్ కావడంతో నియోజకవర్గంలోని ఎరుకల సామాజిక వర్గం నుండి మరీ..ఒత్తిడి పెరిగింది. గతంలో ఎమ్మెల్యేగా పటాన్చెరు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి, సేవలందించిన సీనియర్ నాయకుడిగా సత్యనారాయణకు ప్రజలలో మంచి పేరు ఉంది. కార్మిక నాయకుడిగా ఎంతో మంది కార్మిక కుటుంబాలను ఆదుకున్న చరిత్ర ఉంది. నవ్వుతూనే అందరిని కలగలుపు కొని పోయే మనస్తత్వం ఉండడం సత్యనారాయణకు కలిసొచ్చే అంశం. మియాపూర్-ఇస్నాపూర్ మెట్రో రైల్ పొడగింపులో మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణ పాత్ర కీలకమైంది.

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్చెరువు నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా సత్యనారాయణ ఎన్నికల బరిలో ప్రస్తుతం పటాన్చెరు నియోజకవర్గంలో నెలకొన్న బిఆర్ఎస్ టికెట్ల పంచాయితీకి తెరపడుతుందని రాజకీయ విశ్లేషకుల అంచనా. అవుతుంది. అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం, విభేదాలకు తావివ్వని, ప్రజల, ప్రాంత ,సమస్యలపై సంపూర్తి అవగాహన ఉండి, అందుబాటులో ఉండే వ్యక్తికి టికెట్ ఇవ్వడం సముచితం అని నియోజకవర్గం ప్రజలు భావిస్తున్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లలో ఘోర వైఫల్యం

(మొదటిపేజీ తరువాయి)

వార్డుల్లోని గణేష్ ఉత్సవ కమిటీల వద్దకు వెళ్లి టవర్ సర్కిల్ కు విగ్రహాలను తీసుకురావొద్దని, నేరుగా నిమజ్జనానికి వెళ్లాలని, లేనిపక్షంలో ఇబ్బంది పడతారంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. " మీరు బెదిరిస్తే భయపడే పరిస్థితి లేదు. అసలు మీరెవరు బెదిరించడానికి? అందరూ టవర్ సర్కిల్ కు వస్తారు. ఇక్కడి నుండే నిమజ్జనానికి వెళతాం?ఏం చేస్తారో చూస్తా?. మీరు కనుక మళ్లీ బెదిరిస్తే? నేనే అక్కడికి వస్తా. అక్కడే కూర్చుంటా? చూద్దాం ఏం చేస్తారో? మీరు బెదిరిస్తే పండుగలు జరుపుకునే దుస్థితిలో హిందూ సమాజం లేదు.."అ?ంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తే జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగడి క్రిష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ సహా స్థానిక కార్పొరేటర్లతో కలిసి బండి సంజయ్ టవర్ సర్కిల్ వద్దకు వచ్చారు. రేపు జరగబోయే వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, కరెంట్ వైర్లు తొలగించకపోవడం, నిమజ్జన ఏర్పాట్లు చేయకపోవడాన్ని గమనించిన బండి సంజయ్ అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రేపు నిమజ్జనం జరగబోతుంటే ఇప్పుడు తూతూ మంత్రంగా సిమెంట్ పనులు చేస్తుండటమేంటని మండిపడ్డారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిం చేందుకు ఇక్కడికి వచ్చాను. భక్తియుత, ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు పూర్తి కావాలి. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నగరంలోని గణనాథులంతా రేపు టవర్ సర్కిల్ కు రావాలి. వినాయక నిమజ్జన ఏర్పాట్లలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. ఇంకా కరెంట్ వైర్లు తొలగించలేదు. ఇప్పుడు సిమెంట్ పనులు మొదలు పెట్టారు. తూతూ మంత్రంగా సమీక్షలతోనే అధికారులు సరిపెట్టారు. భక్తులకు సౌకర్యాల కల్పనలో పూర్తిగా విఫలమయ్యారు.

పట్టీపట్టనట్లు వ్యవహరిస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. ఇట్లనే ఉంటే భక్తులు ఆగ్రహావేశాలకు గురవుతారు. దానికి మీరే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రతి ఏటా గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరుపు కుంటున్నాం. కానీ ఈ ఏడాది అధికారులు ఏర్పాట్లను ఏమాత్రం పట్టించుకోలేదు. భక్తులకు సౌకర్యాలు కల్పించలేదు. ఇష్టానుసారంగా రివ్యూలు పెడుతూ?. గణనాథులను టవర్ సర్కిల్ కు తీసుకురావొద్దు.. నేరుగా నిమజ్జనానికి తీసుకెళ్లాలంటూ అన్ని వార్డులకు పోయి అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. మీరు బెదిరిస్తే భయపడే పరిస్థితి లేదు. అసలు మీరెవరు బెదిరించడానికి? అందరూ టవర్ సర్కిల్ కు వస్తారు. ఇక్కడి నుండే నిమజ్జనానికి వెళతాం? మీరు మళ్లీ బెదిరిస్తే? నేనే అక్కడికి వస్తా. నేనే కూర్చుంటా? చూద్దాం ఏం చేస్తారో? మీరు బెదిరిస్తే పండుగలు జరుపుకునే దుస్థితిలో హిందూ సమాజం లేదని హెచ్చరించారు. మీ ఒంటెద్దు పోకడలను సహించబోం. మేం ఏం చేసినా ఎవరూ ఏం చేయలేరు. పైవాళ్లు కాపాడతారని అనుకుం టున్నారేమో.. మిమ్ముల్ని ఎవరూ కాపాడలేరు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజ్ శ్రవణ్, సత్యనారాయణ పేర్లను ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను గవర్నర్ తమిళ సై తిరస్కరించడం ముమ్మాటికీ సరైన నిర్ణయమే. గవర్నర్ తన విచక్షణాధికారులను ఉపయోగించి నిర్ణయం తీసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం గవర్నర్ రబ్బర్ స్టాంప్ గా ఉండాలనుకుంటోంది. వాళ్లు పంపిన ఫైళ్లన్నీ చూడకుండా సంతకం పెట్టాలనుకుంటోంది. గవర్నర్ రాజ్యాంగ బద్దంగా వ్యవహరిస్తే ఆమెకు దురుద్దేశాలు ఆపాదిస్తున్నారు. ఇది సరి కాదు? వాళ్లకు నచ్చినట్లు లేకుండా విమర్శలు చేయడం సరికాదని అన్నారు.

## ఎలిమినేడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


-3.8కోట్ల రూపాయలతో నిధులతో అభివృద్ధి పనులు



**ఇబ్రహీంపట్నం-ప్రభాత సూర్యుడు:** ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు గ్రామంలో 3.8 కోట్ల రూపాయల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభించారు . ఘనంగా స్వాగతం పలికిన గ్రామస్తులు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఎలిమినేడు పెద్దవాగు ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృప ష్, గ్రామ సర్పంచ్ అశోక్ వర్ధన్ రెడ్డి ,ఉప సర్పంచ్ మారత, ఎంపీటీసీ మంచిరెడ్డి ప్రతాప్ రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చిలకల బుగ్గ రాములు, యూత్ విభాగం అధ్యక్షులు జెర్కోని రాజు, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు దోమకొండ నరసింహ, వార్డు సభ్యులు కొట్టంల లక్ష్మమ్మ, చిట్టి అండాలు, బుట్టి మహేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి

టిపిసిసి ఉపాధ్యక్షులు మల్ రెడ్డి రంగారెడ్డి




**ఇబ్రహీంపట్నం-ప్రభాత సూర్యుడు:** తెలంగాణ గడ్డపై భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాటం చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం కేంద్రంలోని మరియు యాచారం మండల కేంద్రంలో ఆ వీరవనితకు పూల మాలాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి చందు, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ కొత్త కురుమ మంగమ్మ, శివకుమార్ , మంకాల దాసు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ గాయత్రీ నగర్ కాలనీ గణేష్ నిమజ్జనం

వేలంపాటలో లడ్డు దక్కించుకున్న బత్తుల నారాయణ అనురాధ, పడసనబోయిన శేఖర్ బాబు సుశీల



**హయత్ నగర్ - ప్రభాత సూర్యుడు :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ గాయత్రీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడిని అత్యంత వైభవంగా నిమజ్జనం చేశారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో నిమజ్జనం సందర్భంగా పాడిన వేలంపాటలో పెద్ద లడ్డును బత్తుల నారాయణ అనురాధ దంపతులు 31 వేల రూపాయలకు దక్కించుకోగా, చిన్న లడ్డును పడసనబోయిన శేఖర్ బాబు సుశీల దంపతులు 23 వేల రూపాయలకు దక్కించుకున్నారు. అనంతరం దేవుడి కలుశాన్ని సున్నపు రమేష్ గౌడ్ రాజేశ్వరి దంపతులు పొందారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ సత్యనారాయణ, టి అంజయ్యలు మాట్లాడుతూ.. అత్యంత వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించామని, కాలనీవాసుల జీవితాల్లో అవిఘ్నాలు తొలగిపోవాలని ఈ సందర్భంగా కోరుకున్నట్లు తెలిపారు. కాలనీ ఉపాధ్యక్షులు రాజు యాదవ్, ఒంటెద్దు బాలకృష్ణ, కోశాధికారి సాయి కృష్ణ, ప్రధాన సలహాదారులు అరలయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు టి రమేష్, సలహాదారులు ఒంటెద్దు పెద్ద బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి జయతేజ కమిటీ సభ్యులు పెయింటర్ రాజు, సిద్దు, గంగాధర చారి, నరసింహయాదవ్, జనార్ధనచారి, గోపి, శ్రీకాంత్, నరసింహ, రవీందర్, నాగరాజు, గురుమూర్తి, చంద్రయ్య, శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి, శేఖర్ బాబు, శంకర్, శ్రీశైలం యాదవ్, రమేష్ గౌడ్, చంద్రశేఖర్, పెయింటర్ శేఖర్, సంజయ్ గౌడ్, లావణ్య, బాలేశ్వరి, సుధ, అరుణ, రామకృష్ణ, శ్రీ గాయత్రీ రియల్ ఎస్టేట్ వ్యవస్థాపకులు కంచర్ల మహేందర్ రెడ్డి మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



## బాల వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

భారీ సంఖ్యలో హాజరైన భక్తులు, కాలనీవాసులు

**పఠాన్ చెరువు - ప్రభాత సూర్యుడు**

పఠాన్ చెరువు పట్టణ కేంద్రంలోని శాంతినగర్ కాలనీ 40 ఫీట్ల రోడ్లో బాల వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని మండపం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భారీ సంఖ్యలో కాలనీవాసులు, భక్తులు అన్నదాన వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు కస్బా శంకరరావు,జంగంపేట ఆంజనేయులు,మాదాడి రవీందర్ రెడ్డి ,మద్దమ శెట్టి రామానుజయ, పుట్టపర్తి సాయి, సేవ ఇంచార్జ్ కృష్ణారెడ్డి, ఐశ్వర్యా రెడ్డి,ప్రతిమ, పవన్, భాస్కర్,కస్బా కళ్యాణ్ కుమార్, శేఖర్, లక్ష్మి గారు ,కమలాకర్, టంకశాల సుబ్బారావు, కార్ దాస్ శ్రీనివాస్, నారెడ్ల విజయభాస్కర్ రెడ్డి ,కవితా రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న ఈ మండపం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారని, ఆటపాటలతో, ముగ్గుల పోటీలతో కోలాట కోలాహలం ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. లడ్డూ వేలం కూడా ప్రతి సంవత్సరం వేలంపాట పెరుగుతూ వస్తుందని తెలిపారు. ఈనెల 29న గణేష్ నిమజ్జన కార్యక్రమం ఉంటుందని భక్తులు పెద్ద ఎత్తున హాజరై చివరిసారిగా స్వామివారిని దర్శించుకుని, స్వామివారి ఆశీస్సులు, పొందాలని కమిటీ సభ్యులు తెలిపారు.





## ఎమ్మెల్యే మంచి కిషన్‌రెడ్డితోనే ఇబ్రహీంపట్నం అభివృద్ధి సాధ్యం

- మొండిగౌరెల్లి సర్పంచ్ బండిమీది కృష్ణ మాదిగ
- బాధితురాలికి 28 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**యాచారం-ప్రభాత సూర్యుడు:** బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డితోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందని మొండిగౌరెల్లి గ్రామ సర్పంచ్ బండిమీది కృష్ణ మాదిగ అన్నారు. మొండి గౌరెల్లి గ్రామానికి చెందిన తీగల ముత్తమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఉండేది సర్పంచ్ బండిమీది కృష్ణ ను సంప్రదించగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఎమ్మెల్యే మంచిరెడ్డి సహకారంతో మంజూరైన 28 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ముత్తమ్మకు అందజేశారు. అభివృద్ధి సంక్షేమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ముందంజలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్, రైతుబంధు, ఆసరా పింఛన్లు లబ్ధిదారులకు చేరవేయడంలో ఎమ్మెల్యే కిషన్ రెడ్డి ముందు వరుసలో ఉన్నారని గుర్తు చేశారు. గ్రామ శాఖ అధ్యక్షులు కట్టెల కృష్ణయ్య, యూత్ అధ్యక్షులు అంబేద్కర్, ఉపాధ్యక్షులు దేరంగుల శ్రీనివాస్, వార్డు సభ్యులు మౌనిక ప్రహ్లాద్, గజ్జల కృష్ణ, నాయకులు తీగల దశరథ, బండారి అంజయ్య, గురుక కుమార్, కర్నాటి యాదయ్య మాదం మల్లయ్య,కర్నాటి శంకర్ పాల్గొన్నారు.




## అభివృద్ధికి నిదుల కొరత లేదు

**ఎమ్మెల్యే కేపీ వివేకానంద**

**కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు :** కోట్లాది రూపాయలు వెచ్చించి మన నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కారణం మన కెసిఆర్ ప్రభుత్వమేనని కుత్బుల్లాపూర్ లో 115 వ రోజు ప్రగతి యాత్రలో భాగంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ లో ప్రగతి యాత్రలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కే పి వివేకానంద్ ముఖ్య అతిధిగా 132 వ జీడిమెట్ల డివిజన్ పరిధిలోని 5.76 కోట్ల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా వైష్ణవి ఎనక్లేవ్లో రూ. 64 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, ఎన్.సి.ఎల్ కాలనీలో రూ. 91.00 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, సప్తగిరి ఎనక్లేవ్ లో రూ. 32.00 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, అంగడిపేట్ లో రూ. 58.00 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, జీడిమెట్ల గ్రామం వద్ద రూ. 78.00 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు,రాఘవేంద్ర కాలనీలో రూ. 42.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎం.ఎన్.రెడ్డి నగర్ ఫేస్ లలో రూ. 34.00 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, ప్రసూన నగర్లో రూ. 37.00 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, భూమారెడ్డి కాలనీలో రూ. 39.00 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, వినాయక్ నగర్ రూ.1.06 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పాదయాత్ర చేస్తూ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో జీడిమెట్ల డివిజన్ల పరిధిలోని పలు కానీలలో కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించుకోవడం జరిగింది అని, గడిచిన 9 ఏళ్లలో కోట్లాది రూపాయలు వెచ్చించి నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి పనులను చేపట్టామని ప్రజా సౌకర్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు, సౌకర్యవంతమైన రహదారులు, త్రాగునీరు, మెరుగైన విద్యుత్, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులతో ప్రతి డివిజన్ ను ఆదర్శంగా తీర్చిదిదుతున్నామన్నారు. అనంతరం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా కానీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుంట సిద్దిరాములు, సంపత్ మాధవ్ రెడ్డి, సుధాకర్ గౌడ్, పి జ్ఞానేశ్వర్, కే నగేష్, సమ్మయ్య నేత, యేసు, నదీమ్ రాయి, మసూద్, అరుణ రెడ్డి, ఇందిరా రెడ్డి, ఆర్.వెంకట్, మేడి బాగయ్య, డాక్టర్ రవీందర్ రెడ్డి, నాని, యూత్ లీడర్ వినీత్ , అనిల్ గౌడ్, వెంకట్ రెడ్డి, పద్మ, గణేష్, ఆనంద్ బాబు, అశోక్, కరుణాకర్ రెడ్డి, ఉమాపతి, శ్రీకాంత్, శంకర్, శ్రీనివాస్, సుబ్బా రావు, గోపాల్ రెడ్డి, శంకర్, బలవంత్ రెడ్డి, నర్సింహా రెడ్డి, గోపాల్ రెడ్డి, పెద్ది మల్లేష్, యాదగిరి, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.






## వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకం

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీ




**పెద్దపల్లి- ప్రభాత సూర్యుడు :** వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ తో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అరుణ శ్రీ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలుగా, భూమి, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని, ఆమె ఆశయాలను నేటి తరం వారు కొనసాగించాలని తెలిపారు. సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి, వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచి, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ అని అటువంటి వీర వనితను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, గతంలో చాకలి ఐలమ్మ, సర్వాయి పాపన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి మహనీయుల గురించి తెలిసేది కాదని, భవిష్యత్తు తరాలకు మహనీయుల ఆశయాలు వారు చేసిన పోరాటాల గురించి తెలియజేసేందు కు ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తుందని అన్నారు.చాకలి ఐలమ్మ ఒక కులంలో పుట్టడం వల్ల ఎదగలేదని తను పోరాట పటిమ వల్ల ఎదిగిందని, ఈ విషయాన్ని అందరూ దృష్టిలో పెట్టుకోవాలని ఆయన పేర్కొన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాలకు అన్ని వర్గాలకు చెందిన వారు స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేయాలని, పండుగలా కార్యక్రమాన్ని నిర్వహించాలని, మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జే.రంగా రెడ్డి, రజక సంఘ నాయకులు,రజక సంఘం సభ్యులు శ్రీనివాస్, అశోక్, శంకర్, జిల్లా అధికారులు, బి.సి. జాతీయ సంఘ నాయకులు శ్రీమాన్, బి.సి., రెడ్ క్రాస్ సభ్యులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

**జగిత్యాల - ప్రభాత సూర్యుడు**



ఈ నెల 27న నిర్వహించే ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా కొరారు.. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమాన్ని అధికా రికంగా ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రోజున జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉదయం 11 గంటలకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, ఇట్టి కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయగలరని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే మంచిరెడ్డికి నిరసన సెగ

**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు:** ఇబ్రహీంపట్నం స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి సొంత గ్రామంలో నిరసన సెగ తగిలింది. ఎలిమినేడులో భూసేకరణ ఆపాలని రైతులు ఆందోళనకు దిగారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో పట్టా భూముల భూసేకరణ వెంటనే రద్దు చేయాలంటూ రైతులు నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీని అడ్డుకున్న పోలీసులతో రైతులు వాగ్వాదానికి దిగారు. ??ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రైతులు, ఎమ్మెల్యేను అడ్డుకుంటామని హెచ్చరించారు. రైతులకు మద్దతుగా బిజెపి, కాంగ్రెస్ నేతలు నిలిచారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215